Eenadu Dt 27/11/17





చరిత్ర, రాష్ట్ర సంస్కృతిని కళ్లకుగట్టేలా మెట్రో స్తంభాలపై చిత్రాలు వేస్తున్న చిత్రకారులు

# మెట్రో స్తంభాలపై కళాత్మక చిత్రాలు

- అమీర్‌పేట, హైటెక్ సిటీ ప్రాంతాల్లో సరికొత్త హంగులు
- తీర్చిదిద్దుతోన్న వర్ధమాన కళాకారులు

ఈనాడు, హైదరాబాద్

మెట్రో స్తంభాలు కళాత్మకంగా దర్శనమిస్తున్నాయి. వివిధ కళాకృతులు నగరవాసులను ఆకట్టుకుంటున్నాయి. రహదారికి ఇరువైపులా ఉండే స్తంభాలపై వర్ధమాన కళాకారులు తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించే భిన్న కళారూపాలను, తీర్చిదిద్దుతున్నారు. మెట్రో పరిసరాల సుందరీకరణలో భాగంగా ప్రతి ఐదో స్తంభంపై నిలువు గార్డెన్‌ను, మిగిలిన స్తంభాలపై కళాకృతులను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అమీర్‌పేట, హైటెక్ సిటీ మార్గాల్లో ఈ పనులు మొదలయ్యాయి.

మూడు కారిడార్లలో మియాపూర్ నుంచి ఎల్బీ నగర్, నాగోల్ నుంచి హైటెక్ సిటీ, జేబీఎస్ నుంచి ఇమ్లిబన్ వరకు 2591 స్తంభాలను రహదారి మధ్యలో నిర్మించారు. కొన్నింటిని మినహాయిస్తే చాలావరకు జనం నిత్యం ప్రయాణించే మార్గంలో స్తంభాలు కనిపిస్తుంటాయి. వీటిపై ఇప్పటికే రెండువైపులా నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టీ ప్రకటన బోర్డులు ఏర్పాటు చేసింది. మిగిలిన రెండువైపులా రహదారి వైపు ఉండే స్తంభాలను మరింత సుందరంగా కళాకారులు తీర్చిదిద్దుతున్నారు.

**నగర సంస్కృతితో పాటూ..**

మెట్రో స్తంభాలపై తెలంగాణ సంస్కృతి, చరిత్ర, స్మారక చిహ్నాలు, శిలాకృతులు, ప్రకృతి దృశ్యాలు, వన్యప్రాణులు, సంప్రదాయ, ఆధునిక, సమకాలీన అంశాలపై రంగులతో చిత్రాలను తీర్చిదిద్దుతున్నారు. చార్మినార్, బుద్ధుడు, బోనాలు, బతుకమ్మ, వరంగల్ స్వాగత ద్వారం, బతుకు చిత్రాలను స్తంభాలపై గీస్తున్నారు. దేశంలో మరెక్కడా లేని విధంగా మొదటిసారిగా మన దగ్గరే వీటిని చేపడుతుండడం విశేషం. మెట్రో ప్రారంభం, ప్రపంచ ఔత్సాహిక పారిశ్రామికవేత్తల సదస్సు నేపథ్యంలో మెట్రో సరికొత్త అందాలు ఆకట్టుకుంటున్నాయి.

